సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



గంజాయి జోలికి వెళ్తే కఠిన చర్యలు

గంజాయి జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవని గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరించారు.

8లో



సికిల్ సెల్ ఎనీమియాపై కళాజాత

సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత బృందాలు అవగాహన కల్పించాయి.

8లో



'సిల్వర్ ఓక్'తో ఆర్థికాభివృద్ధి

సిల్వర్ ఓక్ మొక్కలను పెంచడం ద్వారా గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు.

8లో

న్యూస్‌రీల్

విద్యుదాఘాతంతో విద్యార్థినికి అస్వస్థత

- పాఠశాలలో ఆడుతుండగా ప్రమాదం
- వెంటనే ఆస్పత్రికి తరలింపు
- తప్పిన ప్రాణాపాయం

సీలేరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న కొర్రా సంజన విద్యుత్‌షాక్‌కు గురైంది. సాయంత్రం 4 గంటల సమయంలో పాఠశాలలో ఆడుతుండగా విద్యుత్ ప్రసరిస్తున్న ఇనుప స్తంభాన్ని తాకడంతో షాక్ తగిలి పడిపోయింది. దీంతో వెంటనే ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్, విద్యార్థులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. పాఠశాల పైకప్పు ఐరన్ కావడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎర్త్ అవడం వల్ల ఇలా జరిగిందని, విద్యార్థికి ఎటువంటి ప్రమాదం లేదని హెచ్‌ఎం తెలిపారు.

నాలుగో యూనిట్లో విద్యుదుత్పత్తి ప్రారంభం

- మరమ్మతులు చేపట్టిన అధికారులు



సీలేరు జలవిద్యుత్ కేంద్రం

సీలేరు: సీలేరు జల విద్యుత్ కేంద్రంలో నాలుగో నంబరు యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ యూనిట్‌లోని బస్‌డెక్‌లోకి 45 రోజుల క్రితం వర్షపు నీరు చేరడంతో మరమ్మతులకు గురైంది. దీంతో అధికారులు శ్రీశైలం నుంచి హీట్‌బ్లోయర్‌ను తీసుకొచ్చి మరమ్మతులు చేపట్టారు. బస్‌డెక్‌లో చేరిన వర్షపు నీటిని తొలగించి గురువారం విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఈఈ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం మూడు యూనిట్లు అందుబాటులో ఉన్నాయని అయితే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున శ్రీశైలం, నాగార్జునసాగర్ జల విద్యుత్ కేంద్రాల్లో ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. అందువల్ల ఇక్కడి విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పాదన చేస్తున్నామని ఆయన వివరించారు.

మద్దిగెడ్డ గేట్లు ఎత్తివేత

- దిగువకు 200 క్యూసెక్కులు విడుదల



మద్దిగెడ్డ జలాశయం నుంచి విడుదల అవుతున్న వరదనీరు

అడ్డతీగల: ఈ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మద్దిగెడ్డ జలాశయానికి వరద తాకిడి నెలకొంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 188 మీటర్లు. జలాశయం ఎగువన కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గురువారం జలాశయం 2,3 గేట్లను ఐదేసి సెంటీమీటర్ల చొప్పున పైకి లేపి రోజుకు 200 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్ట్ ఏఈ శేఖర్‌బాబు తెలిపారు. జలాశయంలోకి రోజుకు 160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. ప్రాజెక్ట్‌లో నీటి మట్టం 187.5 మీటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

మత్స్యకారుడి వలకు చిక్కిన గెలస్కోప్ చేప



సీలేరు: హిమాలయాల్లో మాత్రమే ఎక్కువగా లభ్యమయ్యే మత్స్యసంపదలో ఒక్కటైన గెలస్కోప్ జాతికి చెందిన చేప సీలేరు నదిలో ఈ మధ్య కాలంలో మత్స్యకారుల వలకు చిక్కుతోంది. ఇలా లభ్యమైన 15 కిలోల బరువు ఉన్న చేపను మత్స్యకారుడు స్థానిక మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించాడు. పోషకాలు ఎక్కువగా ఉండే ఈ రకం చేప లభ్యం కావడం ఇది ఐదో సారి అని మత్స్యకారులు తెలిపారు.

కొండకోనల్లో చైతన్య వికాసం

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

చుట్టూ దట్టమైన అరణ్యం.. కొండకోనల మధ్య ఆవాసం.. సంప్రదాయాలు, కట్టుబాట్లతో జీవనం.. విలక్షణమైన ఆహార్యం.. అడవితల్లి ఒడిలో ఒదిగి పయనం.. ఇలా విలక్షణ జీవనశైలి ఆదివాసీలది. వీరి అభ్యున్నతికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. వివిధ సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెచ్చింది. ఆధునికత దిశగా అడుగులు వేసేలా తీర్చిదిద్దింది. ఇలా అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకుని సామాజిక చైతన్యం వైపు అడుగులు వేస్తూ ప్రగతికి బాటలు వేసుకుంటున్నారు.



పెదబయలు మండలంలో అత్యంత మారుమూల ప్రాంతం ఇంజరికి నిర్మించిన తారు రోడ్డు

- ప్రత్యేక జిల్లాగా ఏర్పాటుతో మారుతున్న గిరిజనుల జీవనశైలి
- గత ప్రభుత్వ హయాంలో సమగ్ర గిరిజనాభివృద్ధి
- గిరిజనుల పక్షపాతిగా వినూత్న కార్యక్రమాలు
- మారుమూల పల్లెలకు సత్వర వైద్యం, రోడ్లు, వంతెనలు
- అందుబాటులోకి సాంకేతిక వ్యవస్థ
- నాడు–నేడులో ఆస్పత్రులు, పాఠశాలలు అభివృద్ధి
- రైతు భరోసాతో పెట్టుబడి ఆసరా
- అటవీ హక్కు చట్టంతో 1,40,407 మందికి లబ్ధి
- జగనన్నను మరువని ఆదివాసీలు

సాక్షి, పాడేరు: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, అలవాట్లు, వ్యవహార శైలి విభిన్నంగా ఉంటుంది. ఇప్పటికీ పాత అలవాట్లను అపురూపంగా కాపాడుకుంటూ వస్తున్నారు. తెల్లవారితే కొండపోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణతోనే వారి జీవనం ప్రారంభమవుతుంది. అడవులలో లభించే ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకోవడంతో పాటు పోడు వ్యవసాయం ద్వారా పండించుకున్న పంటలను తింటూ జీవనం సాగిస్తున్నారు. అడవులలో గిరిజనులకు లభించే ఉత్పత్తులను వారాంతపు సంతలకు తీసుకువచ్చి వాటిని విక్రయించి వాటి ద్వారా వచ్చే సొమ్ములతో వారానికి కుటుంబ పోషణకు సరిపోయే నిత్యావసర సరుకులను కొనుగోలు చేసుకుని తీసుకువెళ్తుంటారు. ఇలా సాగుతున్న వీరి జీవనం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటుతో ఆధునికత వైపు అడుగులు వేస్తోంది.

గత ప్రభుత్వంలో ప్రత్యేక చర్యలు

ఆదివాసీల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. గిరిజనులకు 50 శాతం పనులు, పదవుల్లోనూ రిజర్వేషన్ కల్పిస్తూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచలనమైన నిర్ణయం తీసుకోవడంతో పాటు చట్టాన్ని కూడా తీసుకువచ్చారు. ఈ చట్టంపై 50 శాతం మహిళలకు పలు పదవుల్లో అవకాశాలు లభించాయి. కొండశిఖర గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసీ (పీవీటీజీ)లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందక పోవడంతో ఆజాతి గిరిజనుల సంక్షేమానికి గత ఐదేళ్లలో అధిక ప్రాధాన్యమిచ్చారు. బాక్సైట్ జీవో 97 రద్దు చేసి చరిత్ర సృష్టించారు.



అందుబాటులోకి వచ్చిన సెల్ నెట్‌వర్క్

చేరువైన పాలన

పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు పేరిట గిరిజనులకు ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయడం కూడా చారిత్రాత్మకమే. 22 మండలాల్లో 83 శాతం మంది గిరిజనులే ఉన్నారు. వీరందరి సంక్షేమానికి గత ప్రభుత్వం 352 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి అధికార యంత్రాంగాన్ని గ్రామస్థాయిలో అందుబాటులోకి తెచ్చింది. విద్య, వైద్యం, రోడ్లు, కమ్యూనికేషన్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో గిరిజన గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి.

1,40,407 మందికి హక్కు పట్టాలు

అటవీ హక్కుల చట్టంలో పట్టాలు పొందిన సన్న, చిన్నకారు రైతులకు, మైదాన ప్రాంత రైతులకు సమానంగా హక్కు, ప్రభుత్వ పథకాలు పొందేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అటవీ భూములు సాగు చేస్తున్న 1,40,407 మంది గిరిజనులకు 1.50 లక్షల ఎకరాల అటవీ భూములను పలు విడతలుగా పంపిణీ చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్వ హక్కులు కల్పించింది.

జిల్లా సమాచారం

మండలాలు	: 22
విస్తీర్ణం	: 1258 చ.కిమీ
భౌగోళిక విస్తీర్ణం	: 12 లక్షల హెక్టార్లు
రిజర్వ్ ఫారెస్ట్	: 8 లక్షల హెక్టార్లు
వ్యవసాయం,ఉద్యానవనం, కాఫీ తోటలు	: 2.45 లక్షల హెక్టార్లు
గ్రామాలు	: 5,108
జనాభా	: 10.58 లక్షలు
అక్షరాస్యత శాతం	: 48.34

అందివచ్చిన ఆధునిక వైద్యం

- జిల్లా కేంద్రమైన పాడేరులో రూ.500 కోట్లతో వైద్య కళాశాల మంజూరు చేశారు. త్వరలోనే ఇక్కడ వైద్యవిద్య అందుబాటులోకి రానుంది. సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రావడంతో రిఫరల్ కేసుల సంఖ్య తగ్గింది. ఫ్యామిలీ డాక్టర్ వల్ల ఇంటింటికీ వైద్యసేవలు అందుతున్నాయి. రంపచోడవరంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టింది.
- మిషన్ కనెక్ట్ పాడేరుతో 514 గ్రామాలకు రూ.274 కోట్లతో మట్టి, మెటల్ రోడ్ల నిర్మాణం చేపట్టింది.
- మారుమూల గ్రామాలకు తారు రోడ్లు, గెడ్డలపై వంతెనల నిర్మాణాలకు రూ.502.89 కోట్లు వెచ్చించింది. సుమారు 90 శాతం పనులు పూర్తయ్యాయి.
- పీవీటీజీ గ్రామాల్లో సీసీరోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను రూ.11.15 కోట్లతో కల్పించింది.
- ప్రధాన రోడ్లను రూ.9.18 కోట్లతో రోడ్లు భవనాల శాఖ ఆధునికీకరించింది.జిల్లా వ్యాప్తంగా స్టేట్ హైవే రోడ్ల అభివృద్ధికి రూ.32.03కోట్లు కేటాయించింది.
- జిల్లాలోని 349 గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలకు రూ.140.10 కోట్లు, రైతు భరోసా కేంద్రాలకు రూ.74.99 కోట్లు, 208 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను రూ.36.40 కోట్లతో ఏర్పాటుచేసింది.



ఏజెన్సీలో నిర్మించిన సెల్ టవర్

- నాడు–నేడు పథకంలో జిల్లాలోని 47 పీహెచ్‌సీలను రూ.22.69 కోట్లతో అభివృద్ధి చేసింది. ఆస్పత్రులలో గిరిజనులకు పూర్తిస్థాయి వైద్యసౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. రూ.18.74కోట్లతో 12 పీహెచ్‌సీలకు కొత్త భవనాలను నిర్మించింది.
- జిల్లా వ్యాప్తంగా నాడు–నేడు మొదటి విడతలో రూ.165.27 కోట్లతో 581 పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసింది.రెండవ విడతలో 967 పాఠశాలల అభివృద్ధికి రూ.108.96 కోట్లు వెచ్చించి అభివృద్ధికి బాటలు వేసింది.
- వ్యవసాయ పెట్టుబడికి ఇబ్బందులు పడకుండా ఏటా జిల్లాలో 1.68 లక్షల మంది గిరిజన రైతులకు రూ.127 కోట్లు రైతు భరోసా పథకంలో సాయం అందజేసింది.
- అన్ని గ్రామాల్లోను తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికి తాగునీరు అందించే లక్ష్యంగా రూ.629.72 కోట్లతో పనులు చేపట్టింది.
- జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గిరిజనులకు 5జీ నెట్‌వర్క్ సేవలు కల్పించే లక్ష్యంతో రూ.400కోట్లతో 2,061 సెల్‌టవర్లను మంజూరు చేసింది. వీటిలో వివిధ నెట్‌వర్క్‌లకు చెందిన 221 పూర్తయ్యాయి. వీటివల్ల సుమారు 600 గ్రామాలకు నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చింది.

మన్యానికి హైవే వరం



పాడేరు మీదుగా నిర్మించిన జాతీయ రహదారి

రాజమహేంద్రవరం నుంచి జిల్లా మీదుగా విజయనగరం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి జిల్లాకు వరంలా మారింది. టూరిజం కారిడార్‌లో భాగంగా 251.12 కిలోమీటర్ల రోడ్డుకు 2,109.14కోట్లతో ఈ నిర్మాణం చేపట్టింది. ఐ.పోలవరం, గంగవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల, కొయ్యూరు, కృష్ణదేవిపేట, పెదవలస, రంపుల ఘాట్ మీదుగా లంబసింగి, జి.మాడుగుల, పాడేరు, అరకు, అనంతగిరి మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి త్వరలో అందుబాటులోకి రానుంది.



గత ప్రభుత్వంలో రూ.500 కోట్లతో పాడేరులో చేపట్టిన వైద్య కళాశాల



గుర్రగరువు ప్రాంత అటవీ భూముల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన గిరిజనులు

రింగురోడ్డుతో వెలుగులు



మాగ్రామానికి నా చిన్నతనం నుంచి రోడ్డు సౌకర్యం లేదు. అత్యవసర పరిస్థితిలో కాలినడకన రోగులను తరలించేవాళ్లం. ప్రత్యేక జిల్లా ఏర్పాటుకాకముందు కలెక్టర్లు, ఎస్పీలు హెలికాప్టర్‌లో వచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్దిగరువు–కోండ్రు మీదుగా ఇంజరి, ఇక్కడి నుంచి గుల్లెలు జంక్షన్ వరకు రింగ్ రోడ్డును అభివృద్ధి చేశారు. ఇందుకు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు కేటాయించి మా బతుకుల్లో వెలుగులు నింపింది.

– కొర్రా సుబ్బారావు, ఇంజరి, పెదబయలు మండలం

అటవీ హక్కులతో ఎంతో మేలు



పూర్వం నుంచి సాగులో ఉన్న రెండెకరాల అటవీ భూమికి అటవీ భూముల హక్కు చట్టం ద్వారా గత ప్రభుత్వం సర్వహక్కులు కల్పించింది. ఈ మేరకు పట్టాలు పంపిణీ చేసింది. రెండెకరాల అటవీ భూమి సొంతం అవ్వడంతో మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. మాతో పాటు మా గ్రామంలో అనేకమంది గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేయడంతో అందరూ సంతోషిస్తున్నారు. రైతు భరోసా సాయం కూడా అందించారు. దీనివల్ల ఆర్థికంగా నిలదొక్కుకోగలిగాం.

– పి.భాగ్యలక్ష్మి, డి.గొందూరు, పాడేరు మండలం

శబరి ఎగపోటుతో పొంగిన వాగులు



నాటు పడవలో గర్భిణులను ఆస్పత్రికి తరలిస్తున్న వైద్యసిబ్బంది



చింతూరు, వీఆర్‌పురం రహదారిపై నిలిచి ఉన్న సోకిలేరు వాగు వరదనీరు

చింతూరు: గోదావరి ఉధృతి కారణంగా శబరి నది ఎగపోటుకు గురికావడంతో వాగులు పొంగాయి. దీంతో గురువారం చింతూరు, వీఆర్‌పురం రహదారిపై వరదనీరు నిలిచిపోయింది. జల్లివారిగూడెం, సోకిలేరు, చీకటివాగుల ఉధృతి రెండో రోజు కూడా తగ్గుముఖం పట్టలేదు. దీంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు ప్రారంభం కాలేదు. దీంతోపాటు చింతూరు మండలంలోని ముకునూరు, నర్సింగపేట, చూటూరు, రామన్నపాలెం, బొడ్రాయిగూడెం, చిన్నసీతనపల్లి, కొండపల్లి, పెదశీతనపల్లి, తిమ్మిరిగూడెం, ఏజీకొడేరు, ఉలుమూరు, మల్లెతోట గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాగులు పెరుగుతున్న క్రమంలో వదరనీరు రహదారులను చుట్టుముట్టిన గ్రామాలకు చెందిన హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా నాటుపడవల ద్వారా చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముంపులో రహదారులు

పాఠశాలలు లేని గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఎస్‌టీసీల ఏర్పాటు

కొయ్యూరు: మండలంలోని పాఠశాలలు లేని పలు గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఎస్‌టీసీలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంఈవో ఎల్.రాంబాబు గురువారం తెలిపారు. జోగంపేట, కాకులమామిడి, ఉసిరికపాడు, బొడ్డుమామిడిలంక,ఈదులబంద, గంపరాయి,వైఎస్ పాకల, పుట్టకోట గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. వీటిలో విద్యార్థులకు బోధించేందుకు ఆసక్తిగల, అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీ లోపు కొయ్యూరు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. గడువులోగా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని ఆయన చెప్పారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి, ఆర్థికాభివృద్ధి సాధించే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జిల్లాలో 22 సంఘాలు పనిచేస్తున్నప్పటికీ కొన్నింటిలో సభ్యులు రుణాలు చెల్లించడంలో అశ్రద్ధ వహిస్తున్నారన్నారు. వీటి వసూళ్లపై దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గత 60ఏళ్లుగా కొనసాగుతున్న సహకార వ్యవస్థలోని విధానాలను మార్చాలని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లాలో నిర్మిస్తున్న 42 గిడ్డంగులలో పూర్తయిన వాటిని వెంటనే అద్దెకు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రుణాల పంపిణీని విస్తృతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్, జిల్లా సహకార అధికారి రామకృష్ణంరాజు, జిల్లా వ్యవసాయాధికారి నందు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో అవయవ దాతలకు అంతిమ సంస్కారాలు

ఆరిలోవ (విశాఖ): అవయవ దాతలకు ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరుగుతాయని జీవన్‌దాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. అవయదానం దాతలకు ఆర్డీవో స్థాయి అధికారుల సమక్షంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలకు అవసరమైన నియమావళిని అమలు చేస్తామన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పాడి పరిశ్రమది కీలకపాత్ర

- పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి డాక్టర్ నర్సింహులు



పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి నర్సింహులు

పాడేరు రూరల్(హుకుంపేట): గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పాడి పరిశ్రమ కీలకపాత్ర పోషిస్తుందని పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. గురువారం జిల్లాకేంద్రం పాడేరులోని పశుసంవర్థక శాఖ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. అనంతరం 21వ అఖిల భారత పశుగణనను ఆయన ప్రారంభించారు. సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్థక రంగాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పశుసంవర్థకశాఖ పెదబయలు ఏడీ డా.రాజారవికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సిల్వర్ ఓక్'తో ఆర్థికాభివృద్ధి

– పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: సిల్వర్ ఓక్ మొక్కలను పెంచడం ద్వారా గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మండలంలోని దిగుడుపుట్టులో గురువారం ఆయన పర్యటించారు.ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన సిల్వర్ఓక్ మొక్కలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా గిరిజనులకు సిల్వర్ ఓక్, కాఫీ మొక్కలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎకరాకి 700 మొక్కల చొప్పున పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు,పాడేరు ఏపీడీలు పవన్, శ్రీనివాస్, ఈవోపీఈఆర్డీ అప్పలరాజు,ఏపీవో లింగమూర్తి పాల్గొన్నారు.

హిరోషిమా విషాదానికి 79 ఏళ్లు



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనంచిట్టి అబ్బాయి

పాడేరు రూరల్(హుకుంపేట): జపాన్‌లో హిరోషియా, నాగసాకి నగరాలపై అమెరికా అణుబాంబులతో దాడి చేసి 79 ఏళ్ల అయిందని, ఈ దాడిలో వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారని పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనము చిట్టి అబ్బాయి తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అణుబాంబుల దాడి ఏ విధంగా జరిగిందో విద్యార్థులకు వివరించారు. 1945 ఆగస్టు 6న ఈ దాడి జరిగిందని చెప్పారు. హిరోషిమాలో 1.40 లక్షల మంది, నాగసాకిలో 74 వేల మంది మరణించారని తెలిపారు.

సింహాద్రికి గ్రీన్ సిగ్నల్

- మరో ఐదు రైళ్ల సర్వీసులకు కూడా..
- సాక్షి కథనానికి రైల్వే అధికారుల్లో కదలిక
- దిగొచ్చిన దక్షిణ మధ్య రైల్వే
- పునరుద్ధరించిన రైళ్లు



విశాఖ సిటీ: పేదవాడి రైళ్లు మళ్లీ పట్టాలెక్కనున్నాయి. ఆరు నెలలుగా నడవని సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కూత పెట్టనుంది. 50 రోజులుగా నిలిపేసిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విశాఖ నుంచి మళ్లీ పరుగులు తీయనుంది. 'వాల్తేరుపై పగ' శీర్షికతో సాక్షి ప్రచురించిన కథనానికి రైల్వే అధికారుల్లో కదలిక వచ్చింది. రద్దు చేసిన ఆరు రైలు సర్వీసులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఫలితంగా ప్రయాణికులకు ఎంతో ఊరట కలగనుంది.

వాల్తేరుపై చిన్నచూపు

ఆదాయంలో దూసుకుపోతున్న వాల్తేరు డివిజన్‌పై రైల్వే ఉన్నతాధికారులకు చిన్న చూపే ఉంది. ఒక వైపు దక్షిణ మధ్య రైల్వే, మరోవైపు తూర్పు కోస్తా రైల్వే డివిజన్ అధికారులు వాల్తేరుపై పగ పట్టినట్లు వ్యవహరిస్తున్నారు. డివిజన్‌లో అత్యధికంగా ఆదాయం వచ్చే విశాఖ నుంచి రైళ్ల మళ్లింపు, రద్దు నిర్ణయాలు తీసుకుంటుండడం అందరికీ విస్మయాన్ని కలిగిస్తోంది. విశాఖలో ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటును జాప్యం చేస్తూ వస్తున్న కేంద్ర ప్రభుత్వం.. విశాఖ నుంచి రైళ్ల మళ్లింపు, రద్దు నిర్ణయాలకు అడ్డుకట్ట వేయకపోవడం గమనార్హం. ఆదాయం దెబ్బకొట్టడానికి ఒకవైపు దక్షిణ మధ్య రైల్వే, మరోవైపు తూర్పు కోస్తా రైల్వే అధికారులు ఎప్పటికప్పుడు వాల్తేరు డివిజన్‌కు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూనే ఉన్నారు. ప్రత్యేక జోన్ ఏర్పాటుకు చేసే కీలక నిర్ణయాల్లో సైతం అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి.

పునరుద్ధరించిన రైళ్లు

సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (విశాఖ-గుంటూరు) (17239/40)
డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (విశాఖ-గుంటూరు) (22701/02)
రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (విశాఖ- విజయవాడ) (12717/18)
గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (57271)
విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707/08)
విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220)

11 నుంచి సర్వీసుల పునరుద్ధరణ

దక్షిణ మధ్య రైల్వే పలు ఎక్స్‌ప్రెస్‌లను విశాఖ వైపు నడుపుతోంది. వీటిలో సింహాద్రి, రత్నాచల్, మచిలీపట్నం ఇలా ప్రతి ఎక్స్‌ప్రెస్ అత్యధిక ఆక్యుపెన్సీతో నిత్యం నడిచేవి. కానీ సాంకేతిక కారణాలు చూపించి ఈ సర్వీసులను నిలిపివేశారు. విశాఖ నుంచి ఉదయం సమయాల్లో నడిచే ఈ రైళ్లలో ఉద్యోగులే అత్యధికంగా ప్రయాణించే వారు. టికెట్ ధరలు తక్కువగా, ప్రయాణ వేళలు అనుకూలంగా ఉండడంతో విశాఖ-విజయవాడ మధ్యలో పనులు, వ్యాపారాలు చేసుకొనే వారు సైతం ఈ రైళ్లను ఆశ్రయించేవారు. అయితే పట్టాల మరమ్మతులు, ఆధునికీకరణ పేరుతో కొద్ది నెలల క్రితం ఈ సర్వీసులను నిలిపివేశారు. దీనిపై వాల్తేరు డివిజన్ అధికారులు పలుమార్లు ఆయా డివిజన్ అధికారులకు లేఖలు రాసినా స్పందించలేదు. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే నిర్ణయాలపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవడంతో ఆయా డివిజన్ అధికారులు దిగొచ్చారు. సింహాద్రి, ఉదయ్, రత్నాచల్, గుంటూరు-రాయగడ, తిరుపతి డబుల్ డెక్కర్, విశాఖ-మచిలీపట్నం రైళ్లను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఈ రైళ్లు పట్టా లెక్కనున్నాయి. అయితే విశాఖ-బెంగుళూరు వీకెండ్, విశాఖ-కర్నూలు సిటీ స్పెషల్, విశాఖ-రాజమండ్రి మెము రైలుకు మోక్షమెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. విశాఖ నుంచి బెంగుళూరుకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది. అయినా ఈ సర్వీసులను పునరుద్ధరించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

పునరుద్ధరణకు నోచుకోనివి

విశాఖ-బెంగుళూరు
విశాఖ-కర్నూలు సిటీ స్పెషల్
విశాఖ-రాజమండ్రి మెము

జీవో నంబరు 3కు చట్టబద్ధత కల్పించాలి

- ఆదివాసీ అధికార్ రాష్ట్ర మంచ్ జాతీయ ఉపాధ్యక్షుడు మిడియం బాబూరావు
- నేడు సీఎం చంద్రబాబు ప్రకటించాలని డిమాండ్



మాజీ ఎంపీ మిడియం బాబూరావు

పాడేరు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాడు జీవో నెం.3కు చట్టబద్ధత కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని ఆదివాసీ అధికార్ రాష్ట్ర మంచ్ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పీఎంఆర్సీ భవనంలో ఆదివాసీ ప్రాంత సమగ్రాభివృద్ధి-సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నిక ల సమయంలో జీవో నంబరు 3ను పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఈ మేరకు కట్టుబడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థుల కోసం స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు బాధితులకు తక్షణమే పునరావస ప్యాకేజీ అందజేసి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సూచించారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివాసీ అధికార్ రాష్ట్ర మంచ్ నిరంతరం తమ పోరాటాలను కొనసాగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ అధికార్ రాష్ట్ర మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పాచిపెంట అప్పలనర్స, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పొద్దు బాల్‌దేవ్, నాయకులు పాంగి శ్రీను, మఠ్రి చిట్టిబాబు, చిన్నం నాయుడు, జీవన్ కృష్ణ, కార్తిక్, నర్సయ్య, పాలికి లక్కు, ఎల్.సుందర్‌రావు పాల్గొన్నారు.

నేటి మీకోసం రద్దు

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించాల్సిన మీకోసం ప్రజాసమస్యల పరిష్కార వేదికను శాసనమండలి ఎన్నికల కోడ్ నేపథ్యంలో రద్దు చేశామని కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

గిరిజన రైతులకు సిల్వర్ ఓక్, పండ్ల మొక్కల పంపిణీ

చింతపల్లి: జాతీయ ఉపాధిహామీ పథకం కింద మండలంలో రైతులకు 11 లక్షల సిల్వర్ ఓక్, 85 వేల పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నట్టు ఉపాధిహామీ పథకం ఏపీవో మూర్తి, ఈసీ మధుసూదన్ గురువారం తెలిపారు. వీటితో పాటు 1,940 ఎకరాల్లో వేసేందుకు 1,964 మంది రైతులకు డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, జాఫ్రా, నారింజ, జీడిమామిడి, సపోటా మొక్కలను పంపిణీ చేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులపై ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం సమీక్ష

తాటిచెట్లపాలెం/గోపాలపట్నం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ గురువారం వాల్తేర్ డివిజన్ పరిధిలో పర్యటించారు. వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో కలిసి డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. రిసెప్షన్ యార్డ్, ఓర్ యార్డ్, సెంట్రల్ సిక్ లైన్ యార్డ్, న్యూ కోచ్ కేర్ సెంటర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లోని వంతెనపై ఏర్పాటు చేసిన స్టేషన్ అభివృద్ధి పనుల ఫొటో గ్యాలరీని తిలకించారు. అనంతరం సింహాచలం నుంచి పలాస స్టేషన్ వరకు స్టేషన్ల పరిస్థితులను విండో ట్రయలింగ్ ద్వారా పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్‌లుగా ఎంపికైన సింహాచలం, కొత్తవలస, పలాస స్టేషన్లలో జరుగుతున్న పనుల తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నౌపడ-పూండి సెక్షన్ మధ్య ట్రాక్ రిలేయింగ్ మెషీన్ పనితీరుపై ఆరా తీశారు. ఆయా ప్రాంతాలలో ప్రయాణికులు, సిబ్బందితో మాట్లాడారు. ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వైఎస్ బాబు, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ వి.ఆర్.లెనిన్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఎల్‌ను సందర్శించిన నార్వే ప్రతినిధి బృందం



హెచ్ఎస్ఎల్‌ను సందర్శించిన నార్వే ప్రతినిధి బృందం సభ్యులు

విశాఖ సిటీ : నార్వే కంపెనీస్‌కు చెందిన ప్రతినిధుల బృందం హిందుస్థాన్ షిప్‌యార్డ్‌ను సందర్శించింది. నోవా స్పెక్ట్రమ్ అండ్ ఇన్నోవేషన్ నార్వే డైరెక్టర్ సిడ్‌సెల్ నార్విక్ నేతృత్వంలో బృందం నార్-షిప్పింగ్ ఎగ్జిబిషన్-2025కు హెచ్ఎస్ఎల్ అధికారులను ఆహ్వానించింది. సాంకేతిక భాగస్వాముల సహకారంతో వాణిజ్య, చమురు రంగాల్లో ఉన్న భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు హెచ్ఎస్ఎల్ ప్రయత్నాలు చేస్తున్న షిప్‌యార్డ్ నార్వేజియన్ కంపెనీల వ్యాపార భాగస్వామ్యాల్లో పాల్గొనాలని కోరింది.

బడిఈడు పిల్లలకు ఆధార్ నమోదు

- నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

సాక్షి,పాడేరు: బడిఈడు పిల్లలకు ఆధార్ నమోదు పూర్తి చేసి పాఠశాలల్లో వెంటనే చేర్పించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎంఈవోలంతా పాఠశాలలను తప్పనిసరిగా తనిఖీలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా బినామీ ఉపాధ్యాయులతో నడిపిస్తే ఎంఈవోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రెండు నెలలైనా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలాల వారీగా విద్యార్థుల సంఖ్యను తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ఉపాధ్యాయులా..ఉపాధ్యాయుల కోసం విద్యార్థులా అంటూ ఎంఈవోలను ప్రశ్నించారు. పాఠశాలకు దగ్గరలో ఎక్కడ నెట్‌వర్క్ ఉన్న ముఖ హాజరు వేసుకుని పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. ఈనెల 17న పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2.5 కోట్లు మంజూరు అయ్యాయని, ఈనెల 18 నుంచి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు తయారు చేయాలన్నారు. వీరికి సబ్జెక్టులు,మెథడాలజీలో శిక్షణ ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు, డీడీ కొండలరావు, రంపచోడవరం,చింతూరు అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై కళాజాత



చింతపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

డుంబ్రిగుడ: సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు తీసుకోవలసి జాగ్రత్తలను వివరిస్తూ డుంబ్రిగుడ, అరకు గ్రామాల్లో గురువారం రాజమండ్రి కళాకారులు కళాజాత ప్రదర్శించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యాధి వచ్చిన వెంటనే మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిల్లోగుడ వైద్యాధికారి నజీబ్, అరకు సర్పంచ్ శారద, సౌరి, స్వామి కళాజాత బృందానికి చెందిన శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: సికిల్ సెల్ ఎనీమియాపై అందరు అవగాహన కలిగి ఉండాలని ఆర్వీ నగర్ వైద్యులు సంధ్య, రాజా రవీంద్ర సూచించారు. ఈ వ్యాధిపై రాజమండ్రికి చెందిన వీఆర్ఎస్ రూరల్ ఇండియా సభ్యులు గురువారం చింతపల్లిలో బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వ్యాధి వచ్చిన తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవాలి, వ్యాధులు రాకుండా ఉండాలంటే ఏంచేయాలో వివరించారు.

ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా కళాశాలలో క్విట్ ఇండియా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్. రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో క్విట్ ఇండియా గొప్ప ఉద్యమమన్నారు. చరిత్ర విభాగం అధ్యాపకురాలు వై. విజయలక్ష్మి ,పసుపలేటి నాగబాబు తదితరులు క్విట్ ఇండియా ఉద్యమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు కె.పుష్పరాజు, పట్టాసి చలపతిరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, ఎం.అనిత కుమారి, ఎస్.రాజు, బి.లచ్చన్న ఎస్.అప్పారావు, ఎల్.లలిత కుమారి, కె.ధర్మరావు,కె.బాలరాజు, డాక్టర్ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి జోలికి వెళ్తే కఠిన చర్యలు



పెదగెడ్డాడలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

జి.మాడుగుల: గంజాయి సాగు, రవాణా చేసినా, వీటికి మధ్యవర్తిత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని, అసాంఘిక కార్యక్రమాలకు గిరిజన ప్రజలు, యువత దూరంగా ఉండాలని సీఐ రమేష్ తెలిపారు. గంజాయి సాగు వల్ల కలిగే అనర్థాల గురించి బొయితిలిలో గురువారం గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఉన్నతాధికారులకు తెలియజేసి, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్. అప్పలరాజు, మాజీ సర్పంచ్ తమర్బ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి

రంపచోడవరం: గంజాయిని నిర్మూలించాలని, అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదగెద్దాడ గ్రామంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి రవాణా, వినియోగాన్ని నిర్మూలించాలన్నారు. దాని వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని, మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సోదరుడిపై కత్తితో దాడి

ఎస్.రాయవరం : ఇంటి ఆస్తి విషయమై గురువారం అన్న, తమ్ముడిపై కత్తితో దాడిచేసి గాయపరచాడు. ఎస్ఐ విభీషణరావు అందించిన వివరాలివి. పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన కట్టా అప్పారావు, కట్టా సుబ్బారావు అన్నదమ్ములు ఒకే ఇంట్లో వేరు వేరు గదుల్లో నివసిస్తున్నారు. సుబ్బారావు ఉంటున్న గది కూడా తనకు చెందినదని తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో సుబ్బారావు గదిలో గురువారం మధ్యాహ్నం నిద్రిస్తుండగా అప్పారావు కూరగాయల కత్తితో దాడిచేశాడు. సుబ్బారావుకు మెడ వద్ద స్వల్పంగా గాయమైంది. త్రుటిలో ప్రాణపాయ స్థితి తప్పింది. ఇది గమనించిన స్థానికులు అప్పారావుని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన సుబ్బారావుని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందుతుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే క్రమంలో సుబ్బారావు కుటుంబ సభ్యులపై కూడా గతంలో పెట్రోలుతో దాడి చేసినట్టు పోలీసులకు చెప్పారు. వివరాల మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు.

మోగింది కల్యాణ వీణ



పెళ్లంటే.. పెళ్లంటే పందిళ్లు సందళ్లు తప్పెట్లు.. తాళాలు తలంబ్రాలూ.. మూడే ముళ్లు, ఏడే అడుగులు మొత్తం కలిపి నూరేళ్లు.. అన్నాడో సినీ కవి. జిల్లాలో పెద్దల సాక్షిగా శుభముహూర్తాన ఒక్కటయ్యేందుకు సిద్ధపడ్డ సుమారు 3 వేల జంటలు ఎదురుచూసిన శుభ ఘడియలు వచ్చేశాయి. శ్రావణమాసం ప్రారంభం నుంచే పల్లె, పట్టణాలు కల్యాణ శోభతో కళకళలాడుతున్నాయి. శ్రావణ తొలి శుక్రవారం జిల్లాలో ఎక్కువగా పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో ఊరూ వాడా పెళ్లి పనుల సందడి, సన్నాయి మోతలు మొదలయ్యాయి.

- నేటి నుంచి వివాహ శుభ ముహూర్తాలు
- మూడు నెలల తర్వాత మొదలైన పెళ్లిసందడి
- జిల్లాలో ఏకం కానున్న మూడువేల జంటలు
- పలువురికి చేతి నిండా పని, దండిగా ఆదాయం



వివాహానికి సిద్ధం చేస్తున్న ఓ కల్యాణ మండపం

యలమంచిలి రూరల్: మూఢమి కారణంగా మూడు నెలలుగా ముహూర్తాల్లేక వాయిదా పడిన వివాహాలు ఎట్టకేలకు మొదలయ్యాయి. శుక్రవారం మంచి ముహూర్తం కావడంతో ఎక్కువ జంటలు పెళ్లిపీటలు ఎక్కనున్నాయి. ఈ నెలాఖరు వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. దీంతో అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, చోడవరం, అచ్యుతాపురం, పాయకరావుపేట సహా మండల కేంద్రాల్లోని ఫంక్షన్ హాళ్లు బుకింగ్స్‌తో బిజీగా అయ్యాయి. ఫంక్షన్ హాల్ దొరకనివారు ఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో పందిరి వేసి, తమ స్థాయి మేరకు హడావుడి చేస్తూ పెళ్లికి సిద్ధమవుతున్నారు.

శుభ ముహూర్తాలు ఇవే..

శ్రావణమాసం ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైనా, 7వ తేదీ నుంచి మాత్రమే వివాహ ముహూర్తాలున్నాయి. శ్రావణమాసం సెప్టెంబరు 3తో ముగుస్తుంది. అమావాస్య ముందు ఈ నెల 31 వరకే శుభకార్యాలకు అనువుగా ఉంటుందని పురోహితులు చెబుతున్నారు. ఈ నెల 7 నుంచి 11, 15 నుంచి 18, 21 నుంచి 24, 28 తేదీల్లో వివాహ ముహూర్తాలున్నాయి. సెప్టెంబర్ 3 నుంచి శూన్యమాసం కారణంగా అక్టోబర్ 2 వరకు శుభ ముహూర్తాల్లేవు. మళ్లీ ఆశ్వీయుజంలో(అక్టోబర్ 3 నుంచి డిసెంబర్ 26 వరకు) ముహూర్తాలున్నాయి. డిసెంబర్ 31 నుంచి 2025 జనవరి 29 వరకూ పుష్యమాసం కావడంతో శుభ ముహూర్తాలుండవు. దీంతో ఆగస్టు నెలలో ఉన్న శుభ ముహూర్తాల్లో జిల్లాలోని సుమారు 3 వేల జంటలు పెళ్లి పీటలెక్కనున్నట్లు పురోహితులు చెప్తున్నారు.

చేతినిండా పని.. దండిగా ఆదాయం

గృహప్రవేశాలు, వివాహశుభ ముహూర్తాలతో ఈ నెల్లో చాలా మందికి చేతి నిండా పని దొరకనుంది. దీంతో పాటు దండిగా ఆదాయాన్ని కూడా ఆర్జించనున్నారు. పురోహితులు, బ్యాండు మేళం, ఫొటో, వీడియో గ్రాఫర్లు, ఈవెంట్ల నిర్వాహకులు, ప్రింటింగ్ ప్రెస్, బట్టలు, నగలు, కిరాణా, పండ్లు, పూలు, టెంట్ హౌస్, క్యాటరింగ్, కల్యాణ మండపాల నిర్వాహకులు శ్రావణ ముహూర్తాలకు రెడీ అయ్యారు. బ్యూటీ పార్లర్లు పెళ్లివారితో రద్దీగా మారాయి. శుక్ర మౌఢ్యమి, ఆషాఢం, గురు మౌఢ్యమి కారణంగా 3 నెలల పాటు ఖాళీగా ఉన్న వీరంతా ఇప్పుడు బిజీ అయ్యారు.

ఈ నెలలోనే మంచి ముహూర్తాలు



ఈ ఏడాది వివిధ కారణాల వల్ల వివాహ ముహూర్తాలు కాస్త తక్కువగా ఉన్నాయి. ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో ఎక్కువ జంటలు ఈ నెల్లోనే ఏకమవుతున్నాయి. ఆగస్టు ముహూర్తాలు దాటితే మళ్లీ నెల రోజుల వరకు మంచి ముహూర్తాల్లేవు. గృహప్రవేశాలు, ఇతర శుభ కార్యాలకు కూడా ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.

– కాలనాథభట్ల వెంకటేష్ శర్మ, వేద పండితుడు, యలమంచిలి